## బైక్‌పై వెనుక కూర్చున్న వారితో మాట్లాడితే ఫైన్

**కేరళలో ద్విచక్ర వాహనదారులకు కొత్త నిబంధన**



తిరువనంతపురం, జూలై 28: రోడ్డు ప్రమాదాల నివారణకు కేరళ మోటారు వాహనాల శాఖ(ఎంవీడీ) కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఇక నుంచి ద్విచక్ర వాహనం నడిపే వారు వెనుక కూర్చున్న వారితో మాట్లాడటం శిక్షార్హమైన నేరం. ఈ నిబంధనను కఠినంగా అమలు చేయాలని అన్ని ఆర్టీఏ కార్యాలయాలకు ఆదేశాలు అందాయి. వెనుక కూర్చున్న వారితో ముచ్చట్లలో మునిగిపోతూ బైక్ నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన తర్వాతే ఈ నిబంధనను విధించినట్టు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కే మనోజ్ కుమార్ తెలిపారు. వెనుక ఉన్న వారితో మాట్లాడేందుకు బైక్ నడిపే వారు తల తిప్పడం, ఒకవైపు మళ్లడం వల్ల వాహనం నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నట్టు చెప్పారు. ఈ నిబంధనను ఉల్లంఘించి, బైక్ నడిపే సమయంలో వెనుక కూర్చున్న వారితో మాట్లాడే వారికి జరిమానాలు విధిస్తామని తెలిపారు. అయితే, జరిమానా ఎంత అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు.



## వానొస్తే ఆఫీస్‌లోనూ గొడుగు పట్టాల్సిందే

**కర్ణాటక తహసీల్ కార్యాలయంలో దుస్థితి**

హావేరి: వానొస్తే కార్యాలయం లోపల కూడా గొడుగు పట్టుకోవాల్సిన దుస్థితి కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలోని హావేరి రెవెన్యూ శాఖ కార్యాలయంలో నెలకొంది. 15 ఏండ్ల కాలం నాటి ఈ భవనం సీలింగ్ దెబ్బతింది. మరమ్మతులు చేయించమని, లేదా కార్యాలయాన్ని వేరే ప్రదేశానికి తరలించమని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

## తరగతి గదిలో ప్రిన్సిపల్ దర్జాగా నిద్ర

**పిల్లలతో గాలి విసిరించుకుంటూ సేవలు**



అలీగఢ్, జూలై 28: విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ప్రిన్సిపాల్ కమ్ టీచర్ ఒకరు ఏకంగా క్లాస్ రూమ్‌లోనే హాయిగా నిద్రపోయారు. తరగతి గదిలో నేలపై చాప వేసుకొని సేదతీరారు. పైగా ఆమె నిద్రకు ఎలాంటి భంగం కలగకుండా విసనకర్రతో విసిరే బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. దీంతో వంతులవారీగా పిల్లలు ఆమెకు సేవలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లా ధనిపూర్ ప్రాంతంలోని గోకుల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో చేటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. దీంతో ప్రాథమిక విద్యా శాఖ అధికారి రాకేశ్ కుమార్ సింగ్.. క్లాసులో నిద్రపోయిన డింపుల్ బన్సాల్ అనే ఆ మహిళా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించారు. ఆమె విద్యార్థులను కొడుతున్న మరో వీడియో కూడా వైరల్ అయ్యింది. దీనిపై కూడా విచారణ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

## ఎల్జీబీటీక్యూఐ వ్యక్తులు రక్తదానం చేయొచ్చా?

**రేపు సుప్రీం కోర్టులో విచారణ**

న్యూఢిల్లీ, జూలై 28: ఎల్జీబీటీక్యూఐ (స్వలింగ సంపర్కం చేసే స్త్రీ, పురుషులు, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్లు) వ్యక్తులు రక్తదానం చేయవచ్చా లేదా అనే విషయంపై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ జరపనుంది. రక్తదాతల నిబంధనలు-2017ను సవాల్ చేస్తూ ఢిల్లీకి చెందిన స్వలింగ సంపర్కుడు షరీఫ్ డి రంగ్నేకర్ వేసిన పిల్‌పై కోర్టు తీర్పు వెలువరించనుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం మహిళా సెక్స్ వర్కర్లు, ఎల్జీబీటీక్యూఐ వ్యక్తులు రక్తదానం చేయకూడదు. అయితే ఈ నిబంధనలు వివక్ష పూరితంగా, ఊహాజనితంగా ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. గుడ్డిగా నిషేధం విధించడం సహేతుక కారణం కాదని వాదించారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, గౌరవంతో జీవించే హక్కును ఉల్లంఘించడమేనన్నారు.



## కుమారస్వామికి అస్వస్థత

బెంగళూరు: కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. మీడియా సమావేశంలో మాట్లాడుతుండగా ఆయన ముక్కు నుంచి రక్తం కారడంతో హుటాహుటిన దవాఖానకు తరలించారు. బెంగళూరులో బీజేపీ-జేడీఎస్ నిర్వహించే పాదయాత్ర గురించి ఆయన చెప్తున్నపుడు ఆయన చొక్కా రక్తంతో తడిసిపోవడం కనిపించింది. అంతకుముందు బీజేపీ, జేడీఎస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కర్ణాటకను పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బెంగళూరు నుంచి మైసూరు వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. వచ్చే నెల 3 నుంచి 10 వరకు జరిగే ఈ యాత్రలో కాంగ్రెస్ కుంభకోణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

## సీయూఈటీ-యూజీ ఫలితాలు విడుదల

**ఎట్టకేలకు విడుదల చేసిన ఎన్టీఏ**

న్యూఢిల్లీ, జూలై 28: 'సీయూఈటీ-యూజీ'-2024 ఫలితాలు ఎట్టకేలకు వెలువడ్డాయి. దీంతో దేశంలోని 283 వర్సిటీల్లో యూజీ కోర్సుల అడ్మిషన్లకు మార్గం సుగమమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీచేసే స్కోర్ కార్డ్ ఆధారంగా ఆయా వర్సిటీలు మెరిట్ జాబితాను రూపొందిస్తాయి. దీని ప్రకారం విద్యార్థుల అడ్మిషన్ కౌన్సెలింగ్ సెషన్స్ చేపడతాయి. ఈసారి బిజినెస్ స్టడీస్ సబ్జెక్ట్‌లో 8,024 మంది, పొలిటికల్ సైన్స్‌లో 5,141 మంది, హిస్టరీలో 2,520 మంది, ఇంగ్లిష్‌లో 1,683 మంది, సైకాలజీలో 1,602 మంది విద్యార్థులు పూర్తి మార్కులు సాధించారు. ఇక జనరల్ టెస్ట్‌కు 7.09 లక్షల మంది విద్యార్థులు హాజరుకాగా, ఒక్కరు మాత్రమే ఫుల్ మార్కులు అందుకున్నారు. గణితంలో ఐదుగురు, తెలుగు, ఫ్రెంచ్, జపనీస్, రష్యన్ లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లో ఒక్కొక్కరు పూర్తి మార్కులు సాధించారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 30న పరీక్ష ఫలితాలు వెలువడాల్సింది.

## ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ

- జన్ సురాజ్ పేరుతో అక్టోబర్ 2న ప్రారంభం
- బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తామని వెల్లడి



పాట్నా, జూలై 28: మాజీ ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిశోర్ త్వరలో రాజకీయ పార్టీని పెట్టబోతున్నారు. ప్రస్తుతం బీహార్‌లో నిర్వహిస్తున్న జన్ సురాజ్ ప్రచారాన్ని రాజకీయ పార్టీగా మారుస్తున్నామని, అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు తమ పార్టీని ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. జన్ సురాజ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆదివారం ఆయన ప్రసంగిస్తూ వచ్చే ఏడాది జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. బీహార్ ముఖచిత్రాన్ని మార్చడమే తమ పార్టీ ధ్యేయమని అన్నారు. రెండేళ్ల క్రితం జన్ సురాజ్ ప్రచారాన్ని ప్రారంభించామని, గతంలో చెప్పిన విధంగానే దీనిని రాజకీయ పార్టీగా మారుస్తున్నట్టు ఆయన తెలిపారు. పార్టీ నాయకత్వం, ఇతర వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ మనవరాలు జాగృతి ఠాకూర్ పార్టీలో చేరడాన్ని స్వాగతించారు. అలాగే ఆర్జేడీ మాజీ ఎమ్మెల్సీ రాంబలి సింగ్ చంద్రవంశీ, మాజీ ఐపీఎస్ అధికారి ఆనంద్ మిశ్రా తదితరులు పార్టీలో చేరారు. కాగా, కోటి మంది తన పార్టీలో చేరుతారని ప్రశాంత్ కిశోర్ ఇటీవల ప్రకటించారు.

# లక్ష్యం జలసమాధి

- ఢిల్లీలోని రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి భారీగా వరద నీరు
- తెలంగాణకు చెందిన తాన్యా సహా ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతి
- కోచింగ్ సెంటర్ వద్ద విద్యార్థుల నిరసన
- సంస్థ యజమాని, కోఆర్డినేటర్ అరెస్ట్

న్యూఢిల్లీ, జూలై 28: సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఢిల్లీకి వెళ్లిన ముగ్గురు అభ్యర్థులు వరదనీటిలో మునిగి మరణించారు. కోచింగ్ సెంటర్‌లోని బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో చదువుకుంటుండగా ఉప్పెనలా ముంచెత్తిన వరద ఓ తెలంగాణ యువతితో పాటు మరో ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో రావుస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి ఒక్కసారిగా వరద నీరు చేరింది. ఈ సమయంలో బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో దాదాపు 18 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది ఎలాగోలా బయటపడగా, ముగ్గురు మాత్రం నీటిలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లాకు చెందిన తాన్యా సోని(21), ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన శ్రేయ యాదవ్(25), కేరళలోని ఎర్నాకుళంకు చెందిన నవీన్ దల్విన్(29) వరదనీటిలో మునిగి మరణించారు. లైబ్రరీ డోర్‌కు బయోమెట్రిక్ వ్యవస్థ ఉందని, ఇది లాక్ అయిపోవడం వల్లే వీరు బయటకు రాలేకపోయారని పలువురు విద్యార్థులు చెప్తున్నారు.

**విద్యార్థుల ఆందోళన**

ఈ ఘటనకు స్టడీ సర్కిల్ యాజమాన్యంతో పాటు అధికార యంత్రాంగమే కారణమని ఆరోపిస్తున్న వివిధ కోచింగ్ సెంటర్లకు చెందిన విద్యార్థులు ఘటన జరిగిన రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ముందు ఆదివారం ఆందోళనకు దిగారు. నగరవ్యాప్తంగా ఉన్న అన్ని కోచింగ్ సెంటర్లలోనూ భద్రతా ఉల్లంఘనలు ఉన్నప్పటికీ యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఘటన జరిగిన ప్రాంతంలో వరదనీరు నిలుస్తుండటంపై వారం క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి లక్షల్లో వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్లు కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.



రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ముందు ఆదివారం ఆందోళన చేస్తున్న విద్యార్థులు

### తల్లిదండ్రులు రైలులో ఉండగా మరణవార్త

మృతుల్లో ఒకరైన తాన్యా సోనిది మంచిర్యాల జిల్లా నస్పూర్. వీరి స్వస్థలం బీహార్. తాన్యా తండ్రి విజయ్‌కుమార్.. సీసీసీ నస్పూర్ బంగ్లాస్ ప్రాంతంలో నివాసముంటూ శ్రీరాంపూర్‌లోని సింగరేణి ఎస్ఆర్‌పీ-1 గని మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. చదువులో చురుగ్గా ఉండే తాన్యాను డిగ్రీ పూర్తయిన వెంటనే సివిల్ సర్వీస్ చదివించడానికి ఢిల్లీకి పంపించారు. కాగా, తాన్యా కుటుంబం ఆమె చెల్లిని లక్నోలోని కళాశాలలో దించడానికి శనివారం సాయంత్రమే బయలుదేరింది. రైలులో నాగ్‌పూర్ వద్ద ఉండగా విజయ్‌కుమార్‌కు కూతురు మరణవార్త తెలిసింది. తాన్యా సోని మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి పరామర్శించారు.

**స్టోర్‌రూమ్ పేరుతో లైబ్రరీ నిర్వహణ**

రావుస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లో స్టోర్‌రూమ్, పార్కింగ్‌కు మాత్రమే అనుమతి ఉంది. కానీ అందులో లైబ్రరీ నిర్వహిస్తున్నారు. స్టడీ సర్కిల్ యాజమాని అభిషేక్ గుప్తా, కోఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించినట్టు ఢిల్లీ మంత్రి ఆతిశీ తెలిపారు.




## రీఫండ్ల కోసం అలా చేయొద్దు

**పన్ను చెల్లింపుదారులకు ఐటీ విభాగం హెచ్చరిక**

న్యూఢిల్లీ: ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసేవారి ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కీలక హెచ్చరిక చేసింది. రీఫండ్ల కోసం బోగస్ వ్యయాలు చూపడం, ఆదాయం తక్కువ చేసి చూపించడం, పన్ను కోతలను అధికంగా పేర్కొనడం చేయరాదని, ఇది శిక్షార్హమని పేర్కొన్నది. అలాగే రీఫండ్ల జాప్యానికి ఇది కారణమవుతుందని తెలిపింది. ఆడిట్ అవసరం లేని పన్ను చెల్లింపుదారులంతా తమ రిటర్నులను జూలై 31 కల్లా సమర్పించాల్సి ఉంటుంది. జూలై 26 నాటికి దేశవ్యాప్తంగా ఐదు కోట్ల రిటర్నులు దాఖలైనట్టు సీబీడీటీ తెలిపింది. సకాలంలో రీఫండ్ల రావాలంటే సరైన విధంగా రిటర్నులు దాఖలు చేయాలని ఆదాయపన్ను విభాగం సూచించింది. రీఫండ్ క్లెయిమ్‌లు తనిఖీలను లోబడి ఉంటాయని, ఈ నేపథ్యంలో రీఫండ్ ఆలస్యమయ్యే అవకాశం ఉన్నదని తెలిపింది. క్లెయిమ్‌లలో ఏవైనా తేడాలంటూ రివైజ్డ్ క్లెయిమ్‌ల కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించింది.

## ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ వారికి మాత్రమే

**ఆ సవరణ అందరికీ వర్తించదన్న ఆర్థిక శాఖ**




న్యూఢిల్లీ, జూలై 28: విదేశాలకు వెళ్లేవారంతా తప్పనిసరిగా ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ పొందాలంటూ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించడంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ వివరణ ఇచ్చింది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన సవరణ అందరికీ వర్తించబోదని, ఆర్థిక అవకతవకలకు పాల్పడినవారు లేదా పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్నవారు మాత్రమే ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను పొందేందుకు చేయాల్సిన పనుల్లో 'బ్లాక్ మనీ యాక్ట్-2015'కు వర్తించే నిబంధనలను కూడా చేర్చాలని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతో ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను పొందాలనుకునేవారు తమ బకాయిలన్నింటినీ క్లియర్ చేయాల్సి ఉంటుంది. ప్రతిపాదిత సవరణ ప్రకారం భారత్‌లో నివసించేవారంతా ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను పొందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొన్నది. ఆదాయ పన్ను చట్టం ప్రకారం తీవ్రమైన ఆర్థిక అవకతవకలకు పాల్పడినవారితోపాటు ఆదాయ పన్ను చట్టం లేదా సంపద పన్ను చట్టం కింద నమోదైన కేసుల్లో ప్రమేయం ఉన్నవారు, రూ.10 లక్షల కంటే అధికంగా ప్రత్యక్ష పన్ను బకాయిలు ఉండి వాటిపై ఎలాంటి స్టే లేనివారు మాత్రమే ఈ సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుందని వివరించింది. సరైన కారణాలను చూపించి ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ లేదా చీఫ్ కమిషనర్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే ఏ వ్యక్తి నుంచైనా ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను కోరుతామని ఐటీ విభాగం తెలిపింది. ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను పొందాలనుకునేవారికి ఎలాంటి బకాయిలు లేవని ధ్రువీకరిస్తూ ఐటీ విభాగం ఆ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది.



### ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్‌ను తప్పించనున్న ట్రంప్!

**మాజీ అధ్యక్షుడు క్లింటన్ సలహాదారు కీలక వ్యాఖ్యలు**

వాషింగ్టన్, జూలై 28: రిపబ్లిన్ పార్టీ తరపున ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఒహియో సెనెటర్, తెలుగింటి అల్లుడు జేడీ వాన్స్ ఎంపికపై డొనాల్డ్ ట్రంప్ పునరాలోచనలో పడ్డట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఆయనను తప్పించి.. ఆ స్థానంలో రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థినిగా భారత సంతతికి చెందిన నిక్కీ హేలీని తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నాడట. బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా ఉండగా, ఆయనకు సలహాదారుగా పనిచేసిన పాల్ బీగ్లా ఈ వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి జో బైడెన్ స్థానంలో కమలా హారిస్ రావటంతో ట్రంప్ ఆలోచనలు మారినట్టు సమాచారం.

## అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్

- ప్రమోటర్ల నుంచి 32.72% వాటా
- కొనుగోలుకు రూ.3,954 కోట్లతో ఒప్పందం

న్యూఢిల్లీ: వేగంగా విస్తరిస్తున్న దక్షిణాది సిమెంట్ మార్కెట్‌లో, ముఖ్యంగా తమిళనాడులో తమ పట్టును మరింత పెంచుకునేందుకు ఆదిత్య బిర్లా గ్రూపు ఆధ్వర్యంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగా ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ (ఐసీఎల్) సంస్థ ప్రమోటర్లతోపాటు వారి అసోసియేట్ల నుంచి 32.72% వాటాను కొనుగోలు చేసేందుకు రూ.3,954 కోట్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దీనితోపాటు ఐసీఎల్ షేర్‌హోల్డర్ల నుంచి మరో 26% వాటాను కొనుగోలు చేసేందుకు రూ.3,142.35 కోట్ల ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. దేశంలోని అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థల్లో రెండవదిగా ఉన్న అదానీ గ్రూపు రూ.10,422 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన పెన్నా సిమెంట్ కంపెనీని కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించిన నెల తర్వాత అల్ట్రాటెక్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. పెన్నా కంపెనీని కొనుగోలు చేయడంతో అదానీ గ్రూప్ వార్షిక సిమెంట్ తయారీ సామర్థ్యం 14 మిలియన్ టన్నులు పెరిగి 93 మిలియన్ టన్నులకు చేరుతుంది. కాగా, అల్ట్రాటెక్ 154.86 మిలియన్ టన్నుల స్థాపిత సామర్థ్యంతో గ్రే సిమెంట్‌ను తయారు చేస్తోంది.

## 20 మందితో పెండ్లి!

**మహారాష్ట్రలో నిత్య పెండ్లికొడుకు అరెస్ట్**

ముంబై : దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందిని మోసగించి, పెండ్లి చేసుకున్న ఫిరోజ్ నియాజ్ షేక్ (43)ను మహారాష్ట్ర పోలీసులు ఈ నెల 23న అరెస్ట్ చేశారు. నల్ల సోపారలోని ఓ మహిళను మాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో నిందితుడు చూసి, స్నేహం చేసి, పెండ్లి చేసుకున్నాడు. 2023లో ఆమె నుంచి ల్యాప్‌టాప్, ఇతర విలువైన వస్తువులు, నగదు తీసుకున్నాడు. నిందితుడు విడాకులు తీసుకున్న, వితంతు మహిళలను లక్ష్యంగా చేసుకుని, స్నేహం నటించి, వివాహం చేసుకుని, వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను దోచుకునేవాడు. 2015 నుంచి ఇప్పటి వరకు సుమారు 20 మంది మహిళలను మోసం చేశాడు.

### బాల్య వివాహాల నిషేధం అన్ని మతాలకు వర్తింపు

**కేరళ హైకోర్టు తీర్పు**

కొచ్చి: బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 అన్ని మతాలవారికి వర్తిస్తుందని కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రతి భారతీయుడు మొదట పౌరుడని, ఆ తర్వాతే ఓ మతంలో సభ్యుడవుతారని, అందువల్ల మతంతో సంబంధం లేకుండా అందరికీ ఈ చట్టం వర్తిస్తుందని వివరించింది. పాలక్కాడ్‌లో జరిగిన బాల్య వివాహంపై 2012లో నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఈ తీర్పునిచ్చింది. ఓ వ్యక్తి హిందువు, ముస్లిం, క్రైస్తవ, పారశీకుడు, వంటి వాటిలో దేనికి చెందినవాడైనప్పటికీ, మతంతో సంబంధం లేకుండా అందరికీ 2006 చట్టం వర్తిస్తుంది' అని న్యాయస్థానం స్పష్టం చేసింది.




### ఇంగ్లిష్ ముసుగులో మద్యం షాపునకు దారి

భోపాల్: మధ్య ప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లా నచంఖేదా గ్రామంలో ఓ మద్యం వ్యాపారి అతి తెలివిగా వ్యవహరించి అధికారులకు చిక్కాడు. ''పగటి పూట ఇంగ్లిష్ నేర్చుకోండి'' అని ఓ బ్యానర్‌ను అతని మద్యం దుకాణానికి కొంత దూరంలో పెట్టాడు. ఆ బ్యానర్‌లోని బాణం గుర్తు తన దుకాణాన్ని చూపిస్తున్నది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొందరు దీనిని ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ విషయం నెమ్మదిగా జిల్లా కలెక్టర్ భవ్య మిట్టల్‌కు చేరింది. దుకాణం యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను భవ్య ఆదేశించారు. వేరొకరి భూమిలో ఈ బ్యానర్‌ను ఎవరో కుట్రపూరితంగా పెట్టారని, తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ సమాధానంతో అధికారులు సంతృప్తి చెందలేదు. అతడికి రూ.10,000 జరిమానా విధించారు.



### భూతాపం వల్లే అస్థిర వర్షపాతం

సిడ్నీ, జూలై 28: అయితే అతివృష్టి.. లేకపోతే అనావృష్టి. ఇప్పుడు ప్రపంచమంతా ఎదుర్కొంటున్న వాతావరణ సవాల్ ఇది. అయితే, ఈ పరిస్థితికి కారణం మనుషులేనని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మానవ చర్యల వల్ల పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ వల్లే వర్షపాతంలో అస్థిరత్వం ఏర్పడుతున్నదని చైనా, యూకేకు చెందిన పరిశోధకులు తేల్చారు. ఆస్ట్రేలియా, ఐరోపాతో పాటు తూర్పు, ఉత్తర అమెరికాలో గత వందేండ్ల వర్షపాతాన్ని అధ్యయనం చేసిన తర్వాత ఈ విషయాన్ని గుర్తించారు. ఈ వివరాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 1900ల నుంచి వర్షపాతంలో అస్థిరత్వం పెరుగుతున్నదని, 1950 నుంచి ఇది మరింత ఎక్కువయ్యిందని పరిశోధకులు తెలిపారు. సగటున ప్రపంచవ్యాప్తంగా ఒక దశాబ్దంలో 1.2 శాతం మేర వర్షపాతంలో అస్థిరత్వం పెరుగుతున్నట్టు చెప్పారు.

### స్మార్ట్‌ఫోన్ల నీలి కాంతితో చర్మానికి ముడతలు!


న్యూఢిల్లీ, జూలై 28: స్మార్ట్‌ఫోన్లు అతిగా వాడితే కళ్లు ఒత్తిడికి గురవుతాయని, నిద్రకు భంగం వాటిల్లుతుందని తెలిసిందే. అయితే ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, టీవీల నుంచి వెలువడే నీలి కాంతి వల్ల చర్మంపై ముడతలు ఏర్పడుతాయని తాజా అధ్యయనంలో తేలింది. మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ, డెట్రాయిట్‌లోని హెన్రీ ఫోర్డ్ దవాఖాన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. నీలి కాంతి కొల్లాజెన్ ప్రొటీన్‌పై ప్రభావం చూపుతుందని, ఇది చర్మంపై ముడతలకు దారితీస్తుందని పరిశోధకులు వెల్లడించారు.

### పాత సోడా క్యాన్లతో స్వచ్ఛ ఇంధనం

న్యూయార్క్, జూలై 28: శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా పాత సోడా క్యాన్లు, సముద్ర జలాలతో స్వచ్ఛ ఇంధనాన్ని తయారుచేయవచ్చని చెప్తున్నారు అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)కి చెందిన పరిశోధకులు. అల్యూమినియం సోడా క్యాన్లు సముద్రపు నీటిలో పడినప్పుడు బుడగలు ఉత్పత్తి అవుతాయని, సహజంగా హైడ్రోజన్ తయారవుతుందని వీరు కనుగొన్నారు. ఈ గ్యాస్‌ను ఇంజిన్లు, ఫ్యూయెల్ సెల్‌లకు ఉపయోగించవచ్చని, దీని ద్వారా కర్బన ఉద్గారాలు ఉత్పత్తి కావని వీరు తెలిపారు.

### అరగంట ఎండలో ఉంటే.. జీవితం రెండేండ్లు పెరుగుదల!

హైదరాబాద్: మీ జీవిత కాలాన్ని రెండేండ్లు పెంచుకోవాలనుకొంటే రోజూ 5 నుంచి 30 నిమిషాలు సూర్యరశ్మి శరీరానికి తగిలేలా చూసుకోండి. అతినీల లోహిత కిరణాలు తక్కువ ఉన్న సూర్యరశ్మితో ఆరోగ్యం మెరుగవుతుందని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సుధీర్ కుమార్ ఎక్స్‌లో వెల్లడించారు. ఒక అధ్యయనాన్ని పేర్కొంటూ, సూర్యరశ్మి తగిలే పొగ తాగే వారి జీవిత కాలం రెండేండ్లు పెరిగిందన్నారు. డయాబెటిస్, రక్త పోటు, గుండె జబ్బులు, ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం తగ్గుతుందన్నారు. విటమిన్ డి సప్లిమెంట్స్, సహజ సూర్యకాంతి ద్వారా వచ్చే ప్రయోజనాలు ఒకటి కావన్నారు.



### మానవాళి చరిత్రలోనే భారీ మూలకం

న్యూయార్క్, జూలై 28: మానవళి చరిత్రలో ఇప్పటివరకు చూడని భారీ మూలకాన్ని సృష్టించేందుకు ఒక్క అడుగు దూరంలో ఉన్నట్టు అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు తెలిపారు. టైటానియం పార్టికల్ బీమ్ ఉపయోగించి లివర్‌మోరియం, 'ఎలిమెంట్ 116' నుంచి రెండు పరమాణువులను సృష్టించినట్టు లారెన్స్ బెర్కెలే నేషనల్ ల్యాబొరేటరీ(బెర్కెలే ల్యాబ్) శాస్త్రవేత్తలు న్యూక్లియర్ స్ట్రక్చర్ 2024 సదస్సులో ప్రకటించారు. 120వ మూలకాన్ని సృష్టించడంలో ఇది కీలకమైన అడుగు అని చెప్పారు. ఈ మూలకాన్ని సృష్టించడం అంత సులువు కాకపోయినా, సాధ్యమేనని బెర్కెలే ల్యాబ్ న్యూక్లియర్ సైన్స్ విభాగం డైరెక్టర్ రీయర్ క్రూకెన్ తెలిపారు. కాగా, ఇప్పటివరకు శాస్త్రవేత్తలు కనుగొన్న 118 మూలకాల్లో ఈ ల్యాబ్‌లోనే 16 మూలకాలను కనుగొన్నారు.

### నేతాజీ అస్థికలను భారత్‌కు తెప్పించండి

**ప్రధానికి బోస్ మనుమడు విజ్ఞప్తి**

కోల్‌కతా, జూలై 28: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అస్థికలను భారత్‌కు తెప్పించాలని ఆయన మనుమడు చంద్రకుమార్‌బోస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీకి ఒక లేఖ రాశారు. జపాన్ రాజధాని టోక్యోలోని రెంకోజీ దేవాలయంలో భద్రపర్చిన నేతాజీ అవశేషాలను ఆగస్టు 18వ తేదీ కల్లా భారత్‌కు రప్పించాలని కోరారు. బోస్ మరణంపై ఉన్న తప్పుడు కథనాలకు తెరదించుతూ కేంద్రం నిజాలు వెల్లడిస్తూ ప్రకటన చేయాలని కోరారు. పరాయి గడ్డపై నేతాజీ అస్థికలు ఉండటం దేశానికి ఎంతో అవమానమని ఆయన పేర్కొన్నారు.

### గర్భధారణ ప్రభుత్వోద్యోగానికి అనర్హత కాదు

**ఢిల్లీ హైకోర్టు తీర్పు**

న్యూఢిల్లీ : గర్భం దాల్చడం వ్యాధి లేదా అంగవైకల్యం కాదని, మహిళకు ప్రభుత్వోద్యోగాన్ని నిరాకరించడానికి ఇది ఓ కారణం కాకూడదని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం శారీరక సామర్థ్య పరీక్షను వాయిదా వేయాలని ఓ గర్భిణి చేసిన విజ్ఞప్తిని తిరస్కరించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)ను మందలించింది. ఆ గర్భిణి పట్ల ఆర్‌పీఎఫ్, కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును దుయ్యబట్టింది. కెరీర్ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు మహిళలకు గల హక్కుకు గర్భం దాల్చడం ప్రాతిపదికపై వివక్ష ఎన్నడూ అడ్డంకిగా మారకూడదని స్పష్టం చేసింది.

### 'స్వలింగ వివాహాలు, సహజీవనాలను నిషేధించాలి'

ఛండీగఢ్: దేశంలో సహజీవనాలు, స్వలింగ వివాహాలపై నిషేధం విధించాలని దాదాపు 300 ఖాప్ పంచాయత్‌లు డిమాండ్ చేశాయి. ఇందుకోసం భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించాయి. ఆదివారం హర్యానాలోని జింద్‌లో మహాపంచాయత్ జరిగింది. హర్యానా, యూపీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఖాప్ పంచాయత్‌ల సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు.